సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం। 16। ఫిబ్రవరి। 2025



'క్లస్టర్'తో కొత్త సమస్యలు

స్కూల్ కాంప్లెక్స్‌ల స్థానంలో క్లస్టర్ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో ఉపాధ్యాయులకు కొత్త సమస్యలు ఎదురవుతున్నాయి. 8లో



సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు.



అప్పన్నకు నిత్యకల్యాణం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

తగ్గిన ఉష్ణోగ్రతలు



రాజుపాకలు సమీపంలో కురుస్తున్న మంచు

చింతపల్లి: జిల్లా మళ్లీ కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గడిచిన రెండు వారాలుగా స్థిరంగా ఉన్న ఉష్ణోగ్రతలు రెండు రోజులుగా తగ్గుముఖం పడుతున్నాయి. పొగమంచు భారీగా కురుస్తోంది. జి.మాడుగులలో 7.6 డిగ్రీలు, జీకే వీధిలో 7.9 డిగ్రీలు, చింతపల్లిలో 8.5 డిగ్రీలు, అరుకులోయలో 8.6 డిగ్రీలు,హుకుంపేటలో 9.3 డిగ్రీలు, పాడేరులో 9.6 డిగ్రీలు,పెదబయలులో 9.6 డిగ్రీలు, డుంబ్రిగుడలో 9.8 డిగ్రీలు, ముంచంగిపుట్టులో 11.0 డిగ్రీలు, కొయ్యూరులో 13.2 డిగ్రీలు, అనంతగిరిలో 15.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్టు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు.

భూగర్భ జలాలను పెంచడం అందరి బాధ్యత

- ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

వై.రామవరం(అడ్డతీగల) : భూగర్భ జలాలను పెంపొందించడం అందరి బాధ్యతని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర పథకంలో భాగంగా వై.రామవరం మండలం ఎర్రంరెడ్డిపాలెంలో శనివారం ఇంకుడు గుంతల ఏర్పాట్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ ఇంకుడు గుంతను ప్రతి ఇంటి వద్ద ఏర్పాటు చేసుకోవాలన్నారు. దీని వల్ల భూగర్భ జలమట్టం పెరుగుతుందని చెప్పారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుందామనుకునే వారు ఉపాధిహామీ అధికారులకు దరఖాస్తులను అందజేయాలని తెలిపారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటుచేసుకుంటామని గిరిజనులతో ప్రతిజ్ఞ చేయించారు.ఉపాధిహామీ ఏపీడీ జి.శ్రీనివాస్,ఎంపీడీవో రవికిశోర్,ఉపాధిహామీ ఏపీవో సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

తెలుసుకుంటే లాభం... మలుచుకుంటే అధనం



పనస చెట్టు

గిరిజనుల ఆర్థిక పరిస్థితిలో మార్పు తేవాలి, వారి ఆదాయం రెట్టింపుకావాలన్న లక్ష్యంతో పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం పనిచేస్తోంది. ఇందుకోసం గిరిజనులకు అందుబాటులో ఉండే వనరుల వినియోగం, విలువ ఆధారిత ఉప ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇస్తోంది. దీనిలో భాగంగా జిల్లాలో లభించే పనస పండ్లతో పసందైన వంటకాల తయారీ, మార్కెటింగ్‌పై శిక్షణ అందిస్తోంది. మార్చి నెలలో రెండో బ్యాచ్‌కు శిక్షణ ఇవ్వనున్నారు. పనస పండ్ల లాభాలు తెలియజేసి, వాటి నుంచి అదనంగా ఆదాయం సమకూర్చుకునేలా శిక్షణ అందజేయనున్నారు.

- పనస కాయలతో విలువ ఆధారిత ఉప ఉత్పత్తులు
- తయారీ, మార్కెటింగ్ ద్వారా అధిక ఆదాయం
- ఆ దిశగా శిక్షణ ఇస్తున్న పందిరి మామిడి కేవీకే
- మార్చిలో మరో బ్యాచ్‌కు శిక్షణ



పనస తొనలతో తయారు చేసిన చిప్స్

కరకరలాడే చిప్స్

పచ్చి పనస తొనలతో వీటిని తయారు చేస్తారు. అర కేజీ తొనల నుంచి పిక్కలు వేరు చేయాలి. తరువాత అర ఇంచీ మందంతో పొడవుగా కోయాలి. కోసిన పనస తొనల ముక్కలను గుడ్డలో కట్టి మరిగించిన నీళ్లలో రెండు నిమిషాల పాటు ఉంచి బయటకు తీయాలి.తరువాత వాటిని అరబెట్టుకోవాలి. ఒక పాత్రలో నూనె వేసి తగినంత పసుపు వేసి మరిగించాలి. నూనె బాగా మరిగిన తరువాత అరబెట్టు కొన్న పనస తొనల ముక్కలను వేయించాలి. వాటిపై ఉప్పు,కారం జల్లుకుంటే వేడివేడి చిప్స్ రెడీ

రంపచోడవరం: జిల్లాలో విరివిగా లభించే పనసకాయలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీలో పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం గిరిజనులకు అవగాహన కల్పిస్తోంది. పనస తొనలతో వివిధ రకాల ఆహార పదార్థాలు తయారు చేయడంలో ఇప్పటికే ఒక దఫా 30 మందికి శిక్షణ ఇచ్చారు. ఈ ఏడాది మార్చిలో మరో బ్యాచ్‌కు శిక్షణ ఇచ్చేందుకు కేవీకే ప్రణాళిక సిద్ధం చేసింది.

రెండు లక్షల చెట్లు

జిల్లాలో రెండు లక్షల వరకు పనస చెట్లు ఉన్నట్టు ఉద్యానవన శాఖాధికారుల అంచనా. మారేడుమిల్లి, వై.రామవరం, రంపచోడవరం, అడ్డతీగల, చింతూరు,పాడేరు,చింతపల్లి, అరకు తదితర 19 మండలాల్లో పనస చెట్లు ఎక్కువగా ఉన్నాయి. గిరిజనులు తోటలుగానే కాకుండా ఇళ్ల వద్ద, పంట పొలాల్లో కూడా పనసను పెంచుతారు. పనస కాయల దిగుబడి ఫిబ్రవరిలో ప్రారంభమై మే వరకు లభిస్తాయి. పనస మొదటి దశలో తొనలు, విత్తనాలు(పనస పిక్కలు) తయారు కావు. వీటిని ఎక్కువగా కూరలు, పచ్చళ్ల తయారీకి ఉపయోగిస్తారు. గింజలు అభివృద్ధి చెందే దశలో కూడా కూర పనసగా ఉపయోగిస్తారు. తొనలు వచ్చినా తీపి, వాసన లేకుండా ఉంటాయి. వీటిని చిప్స్ తయారీలో ఉపయోగిస్తారు. పనస తొక్కు పచ్చడి,బజ్జీలు, పకోడి, బిర్యానీ, హల్వా, చాక్లెట్స్,తాండ్ర, జామ్,జ్యూస్, ఐస్‌క్రీమ్, పనస పిక్కల పిండితో పూరీలు, అప్పడాలు తయారు చేయవచ్చు. కేవీకే శాస్త్రవేత్తలు వీటి తయారీపై ఇప్పటికే గిరిజన యువతకు శిక్షణ ఇచ్చారు.



పనస పకోడి



తాండ్ర తయారీ ఇలా

పిక్కలు వేరు చేసిన కేజీ పనస తొనలను వేడి నీళ్లలో వేసుకుని మరిగించుకోవాలి. మెత్తబడిన పనస తొనలను మిక్సర్‌లో వేసుకొని గుజ్జుగా చేసుకోవాలి. ట్రేలలో సమాంతరంగా ఈ గుజ్జును వేసుకోవాలి. తేమ ఆరే వరకు ఎండలోగాని, డ్రయర్ల గాని ఉంచుకోవాలి. తేమ ఆరిపోతే తాండ్ర ట్రేలో నుంచి సులభంగా వస్తుంది. వీటితో పాటు మరికొన్ని విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ ఇవ్వనున్నారు.

ఆర్థిక భరోసా

జిల్లాలో మేలుజాతి పనస ఉత్పత్తులు సీజన్‌లో లభిస్తాయి. అనేక పోషక విలువలు ఉన్న పనసను గిరిజనులు వారపు సంతల్లో, గ్రామాలకు వచ్చే వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. కొనుగోలు దారులులేకపోతే పశువులకు ఆహారంగా వేస్తున్నారు. గిరిజన రైతులు గరిష్ట ధర పొందలేకపోతున్నారు. గతంలో కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ పొందిన పలువురు ఉప ఉత్పత్తులు తయారు చేసి వారపు సంతల్లో విక్రయిస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు.

పోషక విలువలెన్నో..

పనసలో మెండైన పోషక విలువలు ఉన్నాయి. విటమిన్లు, పీచుపదార్థం, ఖనిజ లవణాలు ఉన్నాయి. దీంతో పనస ఉప ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. గిరిజన యువత కొద్దిపాటి మెలకువలు పాటిస్తే పనసకాయలతో పచ్చడి, చిప్స్, పనస జ్యూస్, జామ్‌తోపాటూ పలు రకాల ఉత్పత్తులు తయారు చేయవచ్చని కేవీకే శాస్త్రవేత్తలు తెలిపారు.

నోరూరించే చాక్లెట్లు

పనస తొనలతో తయారు చేసే చాక్లెట్లు చాలా రుచిగా ఉంటాయి. వీటిని చాలా సులభంగా తయారు చేయవచ్చు. కేజీ పనస తొనలను వేడి నీటిలో ఉడికించి, గుజ్జుగా తయారు చేసుకోవాలి. గిన్నెలో నెయ్యి వేసుకుని పనసగుజ్జు, కరిగించిన పాలపొడి, వేయించిన కోకో పొడరు, పంచదార వేసి కాసేపు వేయించుకోవాలి. చల్లారిన తరువాత ముక్కలుగా చేసుకోవాలి. అంతే.. ఆహా ఏమి రుచి అనేలా పనస చాక్లెట్లు సిద్ధమవుతాయి.



పనస పిక్కలతో తయారు చేసిన పిండి

మార్చిలో మరోదఫా శిక్షణ



పందిరిమామిడి కేవీకేలో మార్చి నెలలో మరోమారు పనసతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇవ్వనున్నాం. ఈ ఏడాది ఏజెన్సీలో 25 ఎకరాల్లో పనస మొక్కలు నాటించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. జిల్లాలో అధిక సంఖ్యలో పనసపండ్లు లభిస్తున్నా గిరిజనులు పూర్తిస్థాయిలో ఆదాయం పొందలేకపోతున్నారు. పనసతో విలువ ఆధారిత ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. గిరిజన యువతను ఆ దిశగా ప్రోత్సహించేందుకు కేవీకే కృషి చేస్తోంది.

– క్రాంతి, ఉద్యానవన శాస్త్రవేత్త, కేవీకే, పందిరిమామిడి

రోడ్డు విస్తరణలో మోదమ్మ ఆలయాన్ని మినహాయించాలి

- సబ్ కలెక్టర్‌కు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు విజ్ఞప్తి



సబ్‌కలెక్టర్ సౌర్యమన్ పటేల్‌తో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

సాక్షి,పాడేరు: జాతీయ రహదారి విస్తరణలో ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరు మోదకొండమ్మతల్లి ఆలయానికి మినహాయింపు ఇవ్వాలని ఆలయ కమిటీ చైర్మన్,పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అధికారులను కోరారు.పాడేరు సబ్‌కలెక్టర్ సౌర్యమన్‌పటేల్,జాతీయ రహదారి అధికారులు శనివారం మోదకొండమ్మ ఆలయానికి వచ్చిన సమయంలో ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, ఆలయ కమిటీ సభ్యులు వారిని కలిశారు. మోదకొండమ్మతల్లి ఆలయానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సబ్‌కలెక్టర్‌కు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సబ్‌కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబునాయుడు, సభ్యులు ఉడా త్రినాథ్, చల్లా రామకృష్ణ, డి.పి.రాంబాబు,లకే రత్నాబాయి, రమణ,హరి,సతీష్ పాల్గొన్నారు.

ఈ-శ్రమ్‌తో అసంఘటిత కార్మికులకు భద్రత

పాడేరు : అసంఘటిత రంగ కార్మికులు తప్పనిసరిగా ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని, తద్వార సామాజిక భద్రతతో పాటు వివిధ సంక్షేమ పథకాలు పొందవచ్చునని జిల్లా కార్మిక శాఖ అధికారి టి.సుజాత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ-శ్రమ్‌లో నమోదు చేసుకున్నవారికి 12 అంకెల గుర్తింపు(యూఏఎన్) యూనివర్సల్ అకౌంట్ నంబర్ లభిస్తుందన్నారు. ఈ కార్డుతో ప్రభుత్వం అందించే అన్ని రకాల సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ముఖ్యంగా కార్మికులకు బీమా పథకం వర్తిస్తుందన్నారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2లక్షలు, పూర్తి అంగ వైకల్యం చెందితే రూ.2 లక్షలు, పాక్షిక అంగ వైకల్యం కలిగితే రూ.లక్ష బీమా సదుపాయం పొందవచ్చన్నారు. జిల్లాలో ఉన్న అసంఘటిత కార్మికులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వారసుల కల సాకారమైన వేళ...

- ఎట్టకేలకు అల్లూరి అనుచరుల వారసులకు సమకూరిన ఆవాసాలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రెండు ఎకరాల కేటాయింపు
- క్షత్రియసేవా సంఘం చొరవతో రూ.3.5 కోట్లతో భవనాలు నిర్మించిన నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ
- రేపు ప్రారంభోత్సవం

బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా మన్యం వీరుడు, అగ్గిపిడుగు అల్లూరి సీతారామరాజు జరిపిన సాయుధ పోరాటంలో ఆయనకు కుడి,ఎడమ భుజాలుగా నిలిచిన గాం గంటం దొర, మల్లుదొర వారసుల సొంతింటి కల సాకారమైంది. 11 మందికి వారసుల కోసం నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ రెండు అపార్టుమెంట్లలో 12 ఫ్లాట్లను నిర్మించింది. వాటిని ఈనెల 17న ప్రారంభించనున్నారు. దీంతో స్వాతంత్ర్య సమర యోధులకు నిజమైనా నివాళి అర్పించినట్టువుతోంది. ఏళ్లనాటి కల నెరవేరడంతో గాం గంటం దొర, మల్లుదొర వారసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మల్లుదొర మనువడు బోడిదొర నివసించిన పూరిల్లు (ఫైల్)





అల్లూరి-1,2 గా నామకరణం చేసిన భవనాలు



పదేళ్ల కిందట మల్లుదొర ఫొటో చూపిస్తున్న మల్లుదొర మనుమడు బోడిదొర భార్య అచ్చియ్యమ్మ(ఫైల్)

కొయ్యూరు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అనుచరులైన గాం గంటందొర, మల్లుదొర వారసులకు శాశ్వత ఆవాసాలు సిద్ధమయ్యాయి. పూరిళ్లలో జీవనం సాగిస్తున్న సమరయోధుల వారసుల దుర్భర పరిస్థితిని జాతీయ అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత పడాల వీరభద్రరావు, మరి కొంతమంది నాయకులు గతంలో ప్రభుత్వం, రాజకీయ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం... వారసులు నివాసముంటున్న లంకవీధి వద్ద సుమారు రెండు ఎకరాల స్థలం కేటాయించింది. క్షత్రియసేవా సమితి వినతి మేరకు ఇళ్ల నిర్మాణానికి నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ ముందుకు వచ్చింది. 2023 నవంబర్‌లో అప్పటి అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఐటీడీఏ పీవో అభిషేక్ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రెండేళ్లలో రూ.3.5 కోట్లతో రెండు భవనాల్లో 12 ఫ్లాట్లు నిర్మించారు. ఒక్కో ఫ్లాట్‌లో 1,250 చదరపు అడుగుల్లో ఒక హాలు, రెండు బెడ్‌రూమ్‌లు, ఒక వంట గది నిర్మించారు. మల్లుదొర ముని మనుమడు బోడిదొర కిందటి సంవత్సరం అనారోగ్యంతో మరణించగా, ఆయన భార్య అచ్చియ్యమ్మ నాలుగు సంవత్సరాల కిందట మరణించారు. అల్లూరి సీతారామరాజు అమరుడైన వందేళ్ల తరువాత స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు సొంత ఇళ్లు సమకూరాయి. బోడిదొర,అచ్చియ్యమ్మ దంపతులు మరణించేంత వరకూ లంకవీధిలో పూరి గుడిసెలోనే ఉన్నారు.



రెండు భవనాల మధ్య ఏర్పాటు చేసిన అల్లూరి విగ్రహం

ఫ్లాట్లు అందుకోనున్న వారసులు

గాం గంటం దొర, మల్లుదొర వారసులైన గాం సన్యాసమ్మ, బాబూరావు, నీలకంఠం, రాంబాబు, ధార మల్లేశ్వరి, సీతారామయ్య, సీతమ్మ, రాజుబాబు, శివ, దేశగిరి మల్లమ్మ, యర్రయ్యమ్మలకు ఫ్లాట్లను అందజేయనున్నారు.

అల్లూరి విగ్రహం ఏర్పాటు

రెండు భవనాలకు మధ్యన అల్లూరి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విద్యుత్,తాగునీరు, మరుగుదొడ్లను సమకూర్చారు. సమరయోధుల వారసుల కోసం నిర్మించిన భవనాలను సోమవారం ఉదయం పదిన్నర గంటలకు కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రారంభించనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను చేశారు.

జేఈఈ మెయిన్స్‌లో 'జై' కిసాన్



జైకిసాన్‌ను అభినందిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

రంపచోడవరం: జేఈఈ మెయిన్స్ –2025 పరీక్ష ఫలితాల్లో 97 పర్సంటైల్‌తో కింటుకూరి జైకిసాన్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. వై.రామవరం మండలం కోట గ్రామానికి చెందిన జైకిసాన్ ఎస్టీ రిజర్వ్‌డ్ విభాగంలో జాతీయ స్థాయిలో రెండవ స్థానంలో నిలిచాడు. మారుమూల ప్రాంతమైన కోట గ్రామం నుంచి జేఈఈ మెయిన్స్ పరీక్షకు హాజరై ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని కలెక్టర్ దినేష్‌కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా జైకిసాన్ మాట్లాడుతూ సివిల్స్ సాధించి గిరిజన ప్రాంతంలో ప్రజలకు సేవ చేయాలనేదే తన లక్ష్యమని తెలిపారు. తాను ఐదో తరగతి చదివేటప్పుడు రంపచోడవరం ఐటీడీఏ పీవో పని చేసిన ఇప్పటి కలెక్టర్ దినేష్‌కుమార్ గిరిజనులకు ఎంతో సేవ చేశారని, ఆయనే తనకు ఆదర్శమన్నారు.

తాగునీటి బోర్ల మరమ్మతులకు సామగ్రి సిద్ధం

- రక్షిత తాగునీటి పథకాలకు ముందస్తు మరమ్మతులు
- ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జవహర్‌కుమార్



సాక్షి,పాడేరు: కలెక్టర్,తమశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాగునీటి బోర్ల మరమ్మతులకు సామగ్రిని సిద్ధం చేశామని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జవహర్‌కుమార్ తెలిపారు.శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చేతిపంపుల మరమ్మతుల పనులను అన్ని మండలాల్లో ప్రారంభించినట్టు చెప్పారు.రక్షిత తాగునీటి సరఫరా పథకాలకు ముందస్తుగానే మరమ్మతులు చేపడుతున్నట్టు తెలిపారు. ప్రతి నెల మొదటి, మూడవ శనివారాల్లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తాగునీటి పథకాలు ట్యాంకులు,ఆయా నీటి వనరుల్లో క్లోరినేషన్‌కు చర్యలు తీసుకున్నామన్నారు. ఇంజినీరింగ్ అధికారులు,బోర్ల మెకానిక్‌లు గ్రామాల్లో పర్యటిస్తూ పాడైన బోరుబావులు,తాగునీటి పథకాలను గుర్తించి, వినియోగంలోకి తెస్తున్నారని తెలిపారు. జల్‌జీవన్ మిషన్ కింద మంజూరైన పనులను మార్చి 15నాటికి పూర్తి చేసే లక్ష్యంతో ఉన్నామని ఆయన చెప్పారు.

నిర్వాసిత కుటుంబాలను కాలనీలకు తరలించాలి

- భూమికి భూమి బదలాయింపునకు భూసేకరణ వేగవంతం
- నష్ట పరిహారం చెల్లింపునకు చర్యలు
- కలెక్టర్ దినేష్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: పోలవరం ప్రాజెక్ట్ ముంపు బాధిత కుటుంబాలను నూతనంగా నిర్మించిన పునరావస కాలనీలకు తరలించాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.శనివారం ఆయన కలెక్టరేట్ నుంచి పోలవరం ప్రాజెక్ట్ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి సంబంధించిన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులకు ప్రభుత్వ నిబంధనల మేరకు ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ అమలుజేస్తామన్నారు.రంపచోడవరం డివిజన్‌లో 2, చింతూరు డివిజన్‌లో 4 ఆర్‌అండ్‌ఆర్ కాలనీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ముంపు బాధితులకు ల్యాండ్ టూ ల్యాండ్ మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.గిరిజనేతరుల్లో చాలా మందికి గోకవరంలో ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీలో గృహాలు నిర్మించామని,మిగిలిన అర్హులకు గృహాలు నిర్మిస్తామన్నారు. చింతూరు డివిజన్‌లో జులై,ఆగస్టు నెలల్లో వచ్చే వరదల కంటే ముందుగానే కాలనీలు పూర్తి చేసేందుకు పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.అర్హులైన ముంపు బాధితులను గుర్తించి సమగ్ర పరిశీలన అనంతరం నివేదికల ఆధారంగా ప్యాకేజీ అమలుజేయాలని,వెలగపూడి కాలనీ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఆయన ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఐటీడీఏ పీవో, సబ్‌కలెక్టర్,ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఏర్పాటు చేసే సమావేశాలకు ప్రత్యేక ఉప కలెక్టర్‌కు గైర్హాజరు అవడాన్ని కలెక్టర్ తప్పుపట్టారు.ఇకపై సమావేశాలకు హాజరుకాని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సమావేశంలో ప్రత్యేక కలెక్టర్ సరళవందన, పోలవరం ప్రాజెక్టు అర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అడ్మినిస్ట్రేటివ్ అధికారి వి.అభిషేక్,రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ,ఎస్‌డీసీలు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యకర సమాజం

- గ్రామాల్లో మినీషెడ్ల ఏర్పాటుకు చర్యలు
- కలెక్టర్ దినేష్‌కుమార్



గిరిజనులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్‌వో పద్మలత

సాక్షి,పాడేరు: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకర సమాజం సాధ్యమని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం పంచాయతీ కేంద్రం మినుములూరులో నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామస్తులతో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం కలెక్టర్ వారితో ప్రతిజ్ఞ చేయించారు. పలువురి గిరిజనుల నివాసాలను కలెక్టర్ సందర్శించారు.పారిశుధ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.మినుములూరులోని సంపద తయారీ కేంద్రం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంపద కేంద్రాలకు బదులుగా గ్రామాల్లో షెడ్లు నిర్మిస్తామని తెలిపారు. సర్పంచ్ లంకెల చిట్టెమ్మ, డీపీవో లవరాజు, డీఎల్‌పీవో పి.ఎస్.కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జవహర్‌కుమార్, ఈవోపీఆర్‌డీ రమేష్, పంచాయతీ కార్యదర్శులు చిన్ని,అనూష పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

పరిసరాల పరిశుభ్రతలో అన్నిశాఖల అధికారులు, ఉద్యోగులు భాగస్వాములు కావాలని డీఆర్‌వో కె.పద్మలత కోరారు. కలెక్టరేట్‌లో శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై అధికారులతో ఆమె ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.అనంతరం కలెక్టరేట్‌లోని అన్ని విభాగాల్లోను అధికారులు,సిబ్బంది చెత్తాచెదారాన్ని తొలగించారు. డీఆర్‌వో పద్మలత మొక్కలు నాటారు. కలెక్టరేట్‌లోని సమాచార పౌరసంబంధాలశాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డీపీ ఆర్‌వో గోవిందరాజులు,డివిజనల్ పీఆర్‌వో పండు రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

సలాం.. బేగం

క్యాన్సర్‌ను ఓడించిన ఫిట్‌నెస్ ట్రైనర్

ఓటమిని అంగీకరించని ఫర్జానా బేగం

ఎన్ని మేఘాలొచ్చినా..ఆకాశం కదలదు..ఎన్ని తుఫానులైనా..సముద్రం నిలిచిపోదు.. ఎదురయ్యే బాధలన్నీ..ఎగసి పడే తరంగాలే..ఆపదల గాలి ఎంత వేగంగా వీచినా, దృఢమైన మనసు చలించదు. కోల్పోయినవేమీ కన్నీటి కథలవ్వవు..ఎలాంటి కష్టాలు ఎదురొచ్చినా ధైర్యం చేతిలో తలవంచక తప్పదు..నీ ధైర్యమే నీ గెలుపు పతాకం.. తట్టుకొనే శక్తి ముందు, ఏ గెలుపైనా తక్కువే. వాడిపోయిన పువ్వుల్లా రాలిపోతాయి..కష్టానికి పూచే పూలే నిజమైన..విజయాలై వికసిస్తాయి. అచ్చం ఫర్జానా బేగంలా..క్యాన్సర్ వచ్చిందని ఆమె కుంగిపోలేదు. ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసింది. ఆమె సంకల్పం ముందు క్యాన్సర్ ఓడిపోయింది.

– ఏయూక్యాంపస్

ఆనందంగా..ఆరోగ్యకరంగా సాగుతున్న జీవితం. శారీరక వ్యాయామ, పోషకాహార నిపుణురాలిగా అందరికీ సూచనలిచ్చే వ్యక్తి. ఇద్దరు కుమార్తెలతో సంతోషంగా సాగుతున్న కుటుంబం. ఒక్కసారిగా ఆమె శరీరంలోకి క్యాన్సర్ మహమ్మారి ప్రవేశించింది. భయపడిన ఆమె వైద్యులు చెప్పిన మాట విని అంతలోనే తేరుకుంది. మనోధైర్యాన్ని సడలనివ్వలేదు. క్యాన్సర్‌ను ధైర్యంగా ఎదుర్కొంది. వైద్యుల సూచనలు పాటిస్తూ ముందుకు సాగింది. కాన్సర్ బారిన పడి దానిని అధిగమించి నూతన జీవితాన్ని పొందాలనేవారికి స్ఫూర్తిగా నిలిచారు..నగరానికి చెందిన ఫిట్‌నెస్ ట్రైనర్ ఫర్జానా బేగం.







ఆనందంగా సాగుతున్న జీవితంలో..

గృహిణిగా తన కుటుంబాన్ని, సొంత ఫిట్‌నెస్ సెంటర్‌ను నిర్వహిస్తూ ఆనందంగా సాగుతున్న బేగం జీవితంలో 2017 నుంచి కష్టాలు ప్రారంభమయ్యాయి. షోల్డర్ పెయిన్‌తో వైద్యుల వద్దకు వెళ్లిన ఆమె ఎంఆర్‌ఐ లో ట్యూమర్ ఉన్నట్లు గుర్తించారు. ఆ ట్యూమర్ రిబ్స్‌లోని వెళ్లినట్లు వైద్యులు గుర్తించారు. వైద్యులు సర్జరీ చేశారు. అనంతరం 2019లో తిరిగి తీవ్రమైన ఛాతీ నొప్పితో ఆస్పత్రిలో చేరారు. ఆమె ఛాతీ పక్కటెముకలు రెండూ ట్యూమర్ కారణంగా పూర్తిగా దెబ్బతిన్నట్లు వైద్యులుగుర్తించారు. వైద్యులు బయాప్సీ చేసి క్యాన్సర్‌గా నిర్ధారించారు.

ధైర్యం కోల్పోలేదు

తొలుత కాస్త భయపడినా కొద్దిరోజుల్లోనే ఆత్మస్థైర్యంతో ధైర్యంగా చికిత్సకు వెళ్లారు. కిమో థెరపీ తీసుకున్నారు. కిమో థెరపీ పర్యవసనాలు ఫలితంగా అనేక ఆరోగ్య సమస్యలను చవిచూశారు. వాటన్నింటినీ భరిస్తూ, అధిగమిస్తూ పూర్తిస్థాయిలో చికిత్స తీసుకున్నారు. మనసునిండా మనోబలం, దైవంపై నమ్మకంతో చికిత్సకు సానుకూల ఆలోచనలతో వెళ్లారు. అదే సమయంలో తనకు సంబంధించిన ఫిట్‌నెస్ జిమ్‌లో తన వృత్తిని యథావిధిగా కొనసాగించారు.

కష్టం వచ్చినప్పుడు పోరాడాలి

ఇద్దరు కుమార్తెలకు తాను ఒక ఉదాహరణగా నిలవాలని ఫర్జానా నిర్ణయించుకున్నారు. కష్టం వచ్చినపుడు పోరాడాలని, ఎప్పుడూ వెనకడుగు వెయ్యకూడదని భావించి, ఆచరణలో చూపారు. సమస్యలు జీవితంలో నిత్యం వస్తుంటాయని, పోరాటం మానకూడదంటారు ఫర్జానా. నేను గెలవాలి అనే బలమైన ఆకాంక్ష సంపూర్ణ ఆరోగ్యంతో తయారయ్యేలా చేసిందన్నారు. నేడు ఎందరో క్యాన్సర్ బాధితులకు ఆమె జీవితం ఒక స్ఫూర్తిదాయక పాఠం. ఇటీవల ఆమె బాలకృష్ణ నిర్వహించే అన్‌స్టాపబుల్ షోలో కూడా పాల్గొని తన జీవిత ప్రయాణాన్ని, క్యాన్సర్‌ను జయించిన విధానాన్ని ప్రజలతో పంచుకున్నారు.

వారే నా ధైర్యం

క్యాన్సర్ వచ్చిందని తెలిసిన సమయంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, తన వద్ద శిక్షణ తీసుకున్న ఫిట్‌నెస్ ట్రైనర్లు అందించిన మానసిక స్థైర్యం వ్యాధి నుంచి త్వరగా కోలుకొనేలా చేసింది. మానసిక ఆరోగ్యం దెబ్బ తినకుండా, మనోధైర్యం కోల్పోకుండా ముందుకు సాగడం వలనే త్వరగా కోలుకోవడం సాధ్యపడింది. అదే సమయంలో వైద్యులు, వైద్య సిబ్బంది అందించిన స్థైర్యం మరవలేనిదని ఆమె చెప్పారు. చికిత్స సమయంలో రోజుకో విధంగా శరీరం స్పందించడం, అనేక సందేహాలు రావడం జరిగేది. వీటిని వైద్యులకు వివరిస్తూ వారి సూచనలను స్వీకరిస్తూ ముందుకు సాగారు.

‘క్లస్టర్’తో కొత్త సమస్యలు

- ప్రాథమిక పాఠశాలలు ఒక పూట మూత
- అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులకు ఒకే చోట సమావేశం



పెదమాకవరం క్లస్టర్‌లో సూచనలు చేస్తున్న హెచ్‌ఎం

కొయ్యూరు: స్కూల్ కాంప్లెక్స్‌ల స్థానంలో క్లస్టర్ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో ఉపాధ్యాయులకు కొత్త సమస్యలు ఎదురవుతున్నాయి. శనివారం ఆయా క్లస్టర్లలో ఉపాధ్యాయులతో మొదటి సమావేశాలను నిర్వహించారు. కాంప్లెక్స్ వ్యవస్థకు భిన్నంగా ఉండడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. ఇంతకు ముందు స్కూల్‌కాంప్లెక్స్ విధానంలో ఒక పాఠశాల నుంచి ఒక సబ్జెక్టుకు సంబంధించిన టీచర్ మాత్రమే సమావేశానికి హాజరయ్యేవారు. రెండు మూడు గంటల్లో సమావేశం పూర్తయ్యేది. మిగతా ఉపాధ్యాయులు పాఠశాలలోనే ఉండి విద్యార్థులకు బోధించేవారు. కానీ ఇప్పుడు కొత్త విధానం వల్ల అన్ని పాఠశాలల నుంచి హెచ్‌ఎంతో సహా ఉపాధ్యాయులందరూ హాజరుకావాలి. దీంతో మధ్యాహ్నం వరకు పాఠాలు బోధించి, మధ్యాహ్న భోజనం అనంతరం ప్రాథమిక పాఠశాలల విద్యార్థులను ఇళ్లకు పంపించి వేసి, సమావేశాలకు హాజరుకావలసి వస్తోంది. ఆశ్రమ పాఠశాలలయితే పీడీ లేదా పీఈటీని ఉంచి మిగిలిన ఉపాధ్యాయులందినీ సమావేశానికి రమ్మంటున్నారు. ఉపాధ్యాయులంతా క్లస్టర్ సమావేశానికి వచ్చిన తరువాత సబ్జెక్టుల వారీగా బోధన ఉండడం లేదు. ఉపాధ్యాయులందరూ అన్ని సబ్జెక్టుల మోడల్ పాఠాలను వర్చువల్‌గా వినాల్సి వస్తోంది.దీంతో ఉపాధ్యాయులు అధిక సమయం సమావేశం వద్ద ఉండిపోవలసి వస్తోంది.కాంప్లెక్స్ వ్యవస్థ ఉన్నప్పుడు ఒక్కో సబ్జెక్టు బోధనకు ఒక కాంప్లెక్స్‌లో సమావేశం ఏర్పాటు చేసేవారు.ఇప్పుడు దానికి భిన్నంగా నిర్వహిస్తున్నారు. కొయ్యూరుకు 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న పలకజీడి ఆశ్రమ పాఠశాల నుంచి ఉపాధ్యాయులందరూ సమావేశానికి హాజరుకావలసి వచ్చింది. తిరిగి వారంతా పాఠశాలకు వెళ్లాలంటే సమస్యలు తప్పవు. అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరుకావడంతో సమావేశ మందిరాలు సరిపడక ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈవిషయమై ఎంఈవో రాంబాబును సంప్రదించగా క్లస్టర్ సమావేశాల నిర్వహణలో కొన్ని సమస్యలున్నాయని, వాటిని అధిగమిస్తామని చెప్పారు. పాఠశాలల నుంచి ఉపాధ్యాయులంతా ఒకే సారి రావడం తప్పదన్నారు. దీని మూలంగా ఇబ్బందులు ఉన్నాయని, ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని తెలిపారు.

‘గాదె’కు వ్యాయామ ఉపాధ్యాయుల మద్దతు



సంఘీభావం ప్రకటిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

విశాఖ విద్య: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న గాదె శ్రీనివాసులు నాయుడుకు తమ మద్దతు ప్రకటిస్తున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్ నాయకులు వెల్లడించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల వ్యాయామ ఉపాధ్యాయ జిల్లా కమిటీల సమావేశం శనివారం రాత్రి పెందుర్తి సుజాతానగర్‌లోని ఓ కల్యాణ మండపంలో జరిగింది. రాష్ట్ర అసోసియేషన్ సలహాదారు సుందరరావు మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయులంతా తమ ఐక్యతను చాటేలా రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలన్నారు. గాదె శ్రీనివాసులు నాయుడుకు గెలుపునకు కృషి చేయాలన్నారు. విశాఖ జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎ. అప్పలరాజు, ఎస్. లలిత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంకు ఆరు జిల్లాల నుంచి వ్యాయామ ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై తనకు అవగాహన ఉందని, తనను గెలిపిస్తే వాటి పరిష్కారం కోసం శాసనమండలి వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎస్టీయూ జిల్లా కార్యదర్శి ఇమంది పైడిరాజు మాట్లాడుతూ గాదె గెలుపు ద్వారానే ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు.

వైద్య విద్యార్థులు భావితరాలకు ఆదర్శం కావాలి



వైద్య విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: వైద్య విద్యార్థులు సామాజిక సేవలో చురుగ్గా పాల్గొంటూ భావితరాలకు ఆదర్శం కావాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాలను సందర్శించారు. అనాటమి విభాగంలోని బయో కెమిస్ట్రీ, హిస్టోలజీ ల్యాబ్, బోధన తరగతుల గదులను ఆయన పరిశీలించారు. వైద్య విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ విద్యతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సామాజిక సేవా, సాంస్కృతిక కార్యక్రమాలు, డ్రాయింగ్ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. క్లబ్‌ల ద్వారా సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకు నిధులు మంజూరు చేస్తామన్నారు. వైద్య విద్యార్థులకు ఆసక్తి ఉంటే ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. నెట్‌వర్క్ కవరేజి, కాలేజీ బస్సులు, ఆడిటోరియం, ఆట స్థలం ఏర్పాటు చేయాలని విద్యార్థులు కలెక్టర్‌ను కోరారు.

కళాశాల భవన నిర్మాణాల పురోగతిపై సమీక్ష

మెడికల్ కళాశాల భవన నిర్మాణాల పురోగతిపై కలెక్టర్ దినేష్‌కుమార్ నిర్మాణ సంస్థ ఎన్‌సీసీ, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. అదనపు వర్కర్లను నియమించి నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీ అధికారులు, గ్రామీణ నీటి సరఫరా విభాగం, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా మెడికల్ కళాశాలను సందర్శించి, మురుగు కాలువల నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. బ్లాక్-1ను ఏప్రిల్‌లోను, బ్లాక్-2ను ఆగస్టులోను, వైద్య విద్యార్థుల వసతి గృహాలు, సిబ్బంది నివాస గృహాలను మే నెల నాటికి పూర్తి చేస్తామని ఇంజినీరింగ్ అధికారులు కలెక్టర్‌కు నివేదించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలతాదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మికుమారి, ప్రొఫెసర్ డాక్టర్ శిరీషా, ఈఈ అచ్యుంనాయుడు, డీఈఈలు వర్మ, ఫణికుమార్, జేఈ సురేష్, డీజీఎం మధుబాబు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 86 మంది హాజరు



గురుకుల కళాశాలలో ప్రాక్టికల్ పరీక్షకు హాజరైన బాలికలు

రాజవొమ్మంగి: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 86 మంది విద్యార్థినీ, విద్యార్థులు శనివారం జరిగిన ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరయ్యారు. గురుకుల కళాశాలకు చెందిన 41 మంది, ప్రభుత్వ కళాశాలకు చెందిన 45 మంది ఈ పరీక్షలు రాసారని ప్రిన్సిపాల్లు సుబ్రహ్మణ్యం, శిరీష తెలిపారు. నూరు శాతం పిల్లలు హాజరుకాగా 2 బ్యాచ్‌లుగా పరీక్షలు నిర్వహించామన్నారు.

తేనెటీగల దాడిలో ముగ్గురికి గాయాలు



తేనెటీగల దాడిలో గాయపడి జడ్డంగి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న గిరిజనుడు

రాజవొమ్మంగి: దోనెలపాలేనికి చెందిన ముగ్గురు గిరిజనులు శనివారం తేనెటీగల దాడిలో గాయపడ్డారు. ఒకే కుటుంబానికి చెందిన కేదారి లక్ష్మి, ఏడుకొండలు, సింహాచలం పొలం పనులకు పక్క గ్రామం జమ్మిచావిడి వెళ్లారు. అక్కడ పామాయిల్ తోటలో పని చేస్తుండగా తేనెటీగల దాడిలో గాయపడ్డారు. తోటి కూలీలు వారిని జడ్డంగి పీహెచ్‌సీకు తరలించగా.. చికిత్స పొందుతున్నారు.

అథ్లెటిక్స్‌లో మెరిసిన గిరిజనుడికి అభినందనలు



అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన ప్రసాద్‌ను అభినందిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీవో, ఎంఈవో, సర్పంచ్, తదితరులు

ముంచంగిపుట్టు: రాజస్థాన్ రాష్ట్రం ఆళ్వార్‌లో ఇటీవల నిర్వహించిన 44వ నేషనల్ మాస్టర్స్ వెటరన్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పరుగుల పోటీల్లో సత్తా చాటిన పెదగూడ పంచాయతీ జర్రిపడ గ్రామానికి చెందిన అథ్లెటిక్స్ కుర్తాడి ప్రసాద్‌కు శనివారం అభినందన సభ నిర్వహించారు. 800, 400, 1500 మీటర్ల విభాగాల్లో వెండి, రెండు కాంస్య పతకాలు సాధించిన ఆయనను ఇన్‌చార్జీ ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి, ఎంఈవో కృష్ణమూర్తి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు రమేష్, గిరిజన మహిళా సంఘం అధ్యక్షురాలు ఈశ్వరి సన్మానించారు. మారుమూల గిరిజన గ్రామంలో పుట్టి, ఇంత వయసులోనూ పరుగులో అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి, మండలానికి మంచి పేరు తీసుకురావడం గర్వకారణమని, మరిన్ని పతాకాలు సాధించాలని వారంతా ఆకాంక్షించారు.

‘అర్ధరాత్రి ఫొటో తీయమనడం తగదు’



సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్వరరావు

ముంచంగిపుట్టు: ఆశ్రమ పాఠశాలల్లో రాత్రి పూట విధులు నిర్వహించే ఉపాధ్యాయులు, వార్డెన్‌లు అర్ధరాత్రి వేళ ఫొటో తీసి పెట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడం భావ్యం కాదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి.మహేశ్వరరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన యూటీఎఫ్ నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాత్రి పూట స్టడీ అవర్స్, వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం హర్షణీయమే, కానీ వాటి పేరుతో నిబంధనలకు విరుద్ధంగా రాత్రి 11 నుంచి 12 గంటల మధ్య, తెల్లవారుజామున 5 గంటలకు ఫొటోలు తీసి వాట్సాప్‌లో పెట్టాలని కలెక్టర్ ఆదేశించడం తగదన్నారు. ఉపాధ్యాయుల జాబ్ చార్ట్ మినహాయించి, ఇతర పనులతో ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేయవద్దని, తక్షణమే అర్ధరాత్రి ఫొటోలు అప్‌లోడ్ చేయాలనే దానిపై పునరాలోచన చేయాలని ఆయన జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు ధర్మారావు, దేముడు పాల్గొన్నారు.